నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 7 జనవరి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

ఎంపీ టికెట్ల కోసం కసరత్తు..

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాల నుంచి పోటీ చేసేందుకు అన్ని పార్టీలు సంసిద్ధంగా ఉన్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలో ఎంపీ టికెట్ల కోసం ఇప్పటినుంచే పైరవీలు ప్రారంభించారు. మహబూబ్‌నగర్ జనరల్ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికే చాన్స్ దక్కుతుందని అందరూ భావిస్తున్నారు. సౌమ్యుడిగా, మృదుస్వభావిగా పేరున్న ఆయన కుటుంబం ఈ ప్రాంతంలో పారిశ్రామికవేత్తలుగా చలామణి అవుతున్నారు. ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే ఈసారి కూడా ఆ కుటుంబం నుంచి ఎంపీగా పోటీ చేస్తారని, పార్టీ మారుతున్నారని దుష్ప్రచారం ప్రారంభించారు. అలాంటిదేమీ లేదని ఆ కుటుంబం కొట్టి పారేసింది. కాంగ్రెస్ పార్టీ చీప్ ట్రిక్కులకు పాల్పడుతుందని బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. ఇక నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి సిట్టింగ్ ఎంపీ రాములు ఇంట్రెస్ట్ లేకపోతే అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును రంగంలోకి దింపాలని బీఆర్ఎస్ భావిస్తున్నది. 2009 ఎన్నికల్లో చాలా తక్కువ మెజార్టీతో ఓటమి పాలయ్యారు. ఇక మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు కాంగ్రెస్ నుంచి కల్వకుర్తికి చెందిన మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎస్సీ రిజర్వుడు పార్లమెంట్‌కు జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే మల్లురవి పోటీ పడుతున్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో వంశీచంద్ కీలకంగా వ్యవహరించడంతో ఆయనకే టికెట్ వస్తుందని భావిస్తున్నారు. మరోవైపు పార్లమెంట్ పరిధిలో ఆయన పేరు మీద ఫ్లెక్సీలు కూడా వెలిశాయి. మరోవైపు జడ్చర్ల టికెట్ కోసం పార్టీ ఆదేశాలను పాటించిన మల్లురవి కూడా ఎంపీగా పోటీ చేస్తానని అనుచరుల వద్ద అంటున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం ఆశీస్సులు తనకే ఉన్నాయని టికెట్ ఖాయమని అంటున్నారు. కాగా ఈ పార్లమెంట్ నుంచి కొత్త క్యాండిడేట్లు వస్తున్నారని వారంతా బీఆర్ఎస్ పార్టీ నుంచి జంప్ అవుతున్నారని ఆ పార్టీ కొన్ని పత్రికల్లో చీప్ ట్రిక్స్ ప్లే చేయడం ప్రారంభించింది. బీజేపీ నుంచి మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, పార్టీ కోశాధికారి శాంతకుమార్, మాజీ మంత్రి డీకే అరుణ పోటీ పడుతున్నారు. ఎవరికి వారే టికెట్లు తమకే వస్తాయనే ధీమాతో ఉన్నారు. ఇక నాగర్‌కర్నూల్ స్థానం నుంచి బీజేపీకి పోటీ చేసే అభ్యర్థులే కరువయ్యారు. గతంలో పోటీ చేసిన కేంద్ర మాజీ మంత్రి బంగారు లక్ష్మణ్ కూతురు బంగారు శృతిని మళ్లీ రంగంలో దింపేందుకు ఆ పార్టీ యోచిస్తున్నది.

కాంగ్రెస్ వైఫల్యాలే ఎజెండాగా..

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను పూర్తిస్థాయిలో ఎండగట్టాలని భావిస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక కేసీఆర్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో చేసిన అభివృద్ధి పథకాలు సంక్షేమ కార్యక్రమాలను కొత్తగా అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కడం.. రైతుబంధు పైసలు జమ చేయకపోవడం.. దళితబంధును ఆపేయడం.. గృహలక్ష్మిని రద్దు చేయడం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిస్తున్నారు. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 30 రోజులు దాటుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఈ విషయాన్నీ ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని అంటున్నారు. మరోవైపు బీఆర్ఎస్ క్యాడర్ చెక్కు చెదరలేదనడానికి వార్డు మెంబర్ కూడా పార్టీ మారక పోవడమే ఇందుకు నిదర్శనమని అంటున్నారు. ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ పార్టీ దగా చేసిందని శ్వేతపత్రాల పేరుతో తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బ కొట్టే ప్రయత్నం చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచిస్తున్నారు. అంతే కాక పింఛన్లు ఇంకా జమ చేయకపోవడం, సంక్షేమ పథకాల అమలులో దరఖాస్తుల పేరిట కాలయాపన చేయడం వంటి అంశాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని క్యాడర్‌కు చెబుతున్నారు. యాసంగి పంటకు క్రాప్ హాలిడే ఇవ్వడం.. విద్యుత్ కోతలు షురూ కావడం వంటి అంశాలను విస్తృతంగా ప్రచారం చేయడంతోపాటు బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమనే విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని భావిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడంలో పూర్తిగా విఫలం కావడం.. ఈ ఎన్నికలను నిర్వహించలేని వారి చేతకానితనాన్ని బయట పెట్టాలని సూచిస్తున్నారు.

బీఆర్ఎస్ పక్కా స్కెచ్..

ఈసారి పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ పావులు కదుపుతున్నది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాలను ఎలాగైనా కైవసం చేసుకోవాలని పార్టీ నేతలు భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి కొంత మేర నష్టం జరిగినా.. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్ ఇంకా పార్టీ వైపే ఉండడంతో ఎంపీ ఎలక్షన్లలో కలిసొస్తుందని భావిస్తున్నారు. ఈ మేరకు కిందిస్థాయి క్యాడర్ నుంచి పార్టీ శ్రేణులను బలోపేతం చేసేందుకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీపై వచ్చిన దుష్ప్రచారాన్ని తిప్పికొట్టకపోవడం.. తెలంగాణ తెచ్చిన పార్టీ అభివృద్ధిని ప్రజలకు వివరించడంలో కొంచెం వెనుకబడినప్పటికీ ఓట్లశాతంలో మాత్రం ముందే ఉన్నామని క్యాడర్‌కు విశదీకరిస్తున్నారు. దీంతో కిందిస్థాయి క్యాడర్లో మరింత జోష్ నింపేందుకు పార్లమెంట్ ఎన్నికలు ఉపయోగపడతాయని నేతలు భావిస్తున్నారు.



- ఎంపీ స్థానాలపై కన్నేసిన ప్రధాన పార్టీలు
- టికెట్ల కోసం అప్పుడే మొదలైన పైరవీలు
- అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్న నేతలు
- పక్కా స్కెచ్‌తో బీఆర్ఎస్ అడుగులు
- కేటీఆర్ సమక్షంలో నేతలతో సమావేశాలు
- కాంగ్రెస్ వైఫల్యాలే ఎజెండాగా ముందస్తు ప్రణాళిక

సార్వత్రికకు సన్నద్ధం

- సన్నాహాల్లో అధికార యంత్రాంగం

మహబూబ్‌నగర్, జనవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : త్వరలో సార్వత్రిక (పార్లమెంట్) ఎన్నికలు రానుండడంతో అన్ని పార్టీలు ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలపై కన్నేశాయి. ఈ ఎన్నికలను అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య టికెట్ల పోరు తారాస్థాయికి చేరింది. తెరవెనుక ఉన్న నేతలు తెర ముందుకొస్తున్నారు. కొత్త సంవత్సరం, పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో ఆయా పార్టీల క్యాడర్లో ఎంపీ అభ్యర్థులపై చర్చలు మొదలయ్యాయి. కొందరు నేతలు తమకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. ఎన్నికలకు అధికార యంత్రాంగం కూడా సిద్ధమవుతుండడంతో నేతల్లో టెన్షన్ మొదలైంది. పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా ఆయా పార్టీలు వ్యూహ రచనలు చేస్తున్నాయి. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు స్థానాలను గులాబీ దళం చేజిక్కించుకున్నది. ప్రస్తుతం కూడా అదే సీన్ రిపీట్ చేయాలని భావిస్తున్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చాలా తక్కువ మెజార్టీతో ఓడిపోయినప్పటికీ ఓటర్లలో ఆదరణ తగ్గలేదు. ఈసారి ఎంపీ ఎలక్షన్లు కలిసి వస్తాయని పార్టీ నేతలు భావిస్తున్నారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ ఎంపీగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీగా రాములు కొనసాగుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎంపీ స్థానాలకు గడువు ముగియనున్నది. ముందస్తు ఎన్నికలు జరుగుతాయనే ఊహాగానాలు వస్తున్న నేపథ్యంలో ఆయా పార్టీల నేతలు పార్లమెంట్ ఎన్నికలపై గురిపెట్టారు.

ముందస్తా..? షెడ్యూల్ ప్రకారమేనా..?

పార్లమెంట్ ఎన్నికలు ఏప్రిల్, మే నెలలో షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయా? లేక ముందస్తు ఎన్నికలు వస్తాయా అనేది చర్చనీయాంశంగా మారింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఈనెలలోనే రామ మందిరం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసింది. ఆలయ ప్రారంభోత్సవం జరగగానే కేంద్రంలో ఉన్న ప్రభుత్వాన్ని రద్దుచేసి ముందస్తుకు వెళతారని ప్రచారం జోరుగా సాగుతోంది. ఇదే జరిగితే మార్చిలోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఒకవేళ కేంద్రం ముందస్తుకు వెళ్లకపోతే ఏప్రిల్ నెలలో ఎలాగూ పార్లమెంట్ సభ్యుల పదవీకాలం పూర్తవుతుంది. పోలింగ్ చేపట్టాల్సి ఉండడంతో మే వరకు పూర్తిచేయాల్సి ఉంటుంది. దీంతో ఈసారి పార్లమెంట్ ఎన్నికల ముఖచిత్రం ఏ విధంగా ఉండబోతుందనేది చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికలకు పార్లమెంట్ ఎన్నికలకు ఓటింగ్ డిఫరెంట్‌గా ఉండటం ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రత్యేకత. గత రెండు పర్యాయాలు ఇదే జరిగింది. ఈసారి కూడా అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరి కాకుండా పార్లమెంటుకు విభిన్న తీర్పు వస్తుందని భావిస్తున్నారు. దీంతో ఈ ఎన్నికలు బీఆర్ఎస్‌కే కలిసి వస్తాయని విశ్లేషకుల అంచనా. మరోవైపు బీజేపీ, కాంగ్రెస్ మధ్య కూడా పోటీ పెరిగి బీఆర్ఎస్‌కు చాన్స్ దొరికే అవకాశం ఉందని అంటున్నారు.

బీఆర్ఎస్ నాయకులతో కలిసి కలెక్టర్ బీఎం సంతోష్‌కువిన తిపత్రంఅం దజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

సంక్షేమ పథకాల రద్దుకు కాంగ్రెస్ కుట్ర

- బీఆర్ఎస్ పథకాలను కొనసాగించాలి
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత
- న్యాయం చేస్తానని హామీ

గద్వాల, జనవరి 6 : కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడానికి కుట్రలు చేస్తున్నదని, ఆ పథకాలను యథావిధిగా కొనసాగించాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడుతూ గద్వాల మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం చేపట్టి లబ్ధిదారులను ఎంపిక చేశామని, ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చామని వారికే ఇండ్లు కేటాయించాలని కోరారు. గొర్రెల పథకంలో భాగంగా డీడీలు కట్టిన వారికి తక్షణమే గొర్రెలు అందించడంతో పాటు, దళితబంధు, బీసీ బంధు లబ్ధిదారులకు సాయం అందించాలని, కేసీఆర్ ప్రభుత్వం ఎంపిక చేసిన గృహలక్ష్మి లబ్ధిదారులకు వెంటనే సాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కోసం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జీవో నెంబర్ 354 కింద పట్టణానికి రూ.50 కోట్లు, ప్రతి పంచాయతీకి రూ.10లక్షల చొప్పున కేటాయిస్తూ నిధులు విడుదల చేశాడని వీటిని వినియోగించుటకు ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ పై విషయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి లబ్ధిదారులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని చెప్పారు. అంతకుముందు నూతనంగా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్‌ను ఎమ్మెల్యేతోపాటు మున్సిపల్ చైర్మన్ కేశవ్ శాలువా కప్పి, బొకే అందించి సన్మానించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీలు ప్రతాప్‌గౌడ్, రాజారెడ్డి, విజయ్‌కుమార్, జెడ్పీటీసీలు పద్మావెంకటేశ్వర్‌రెడ్డి, శ్యామల, రాజశేఖర్, పీఏసీసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి, వైస్ చైర్మన్లు బాబర్, సుదర్శన్‌రెడ్డి, రామకృష్ణ, సర్పంచులు రఘువర్ధన్‌రెడ్డి, మహబూబ్, కౌన్సిలర్ మురళి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్ మండలంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ముగిసిన ప్రజాపాలన

మహబూబ్‌నగర్, జనవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ శనివారంతో ముగిసింది. గత నెల 28 నుంచి అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. దరఖాస్తులను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 1,95,235, జోగులాంబ గద్వాలలో 1,55,324, నారాయణపేటలో 2,16,000, వనపర్తిలో 2,02,698 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికి కూడా దరఖాస్తులు ఇవ్వని వారు తాసీల్దార్ కార్యాలయాల్లో విడుతల వారీగా అప్లికేషన్లు చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

మాట్లాడుతున్న ఎంపీ మన్నె, బాధితకు టుంబాలనుప రామర్శిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

బాలానగర్, జనవరి 6 : మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా, ఇద్దరు దవాఖానలో చికిత్స పొందుతున్న కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి, మైరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అలాగే మృతి చెందిన ఐదుగురు కుటుంబాలకు రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. అదే విధంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి కూడా మృతుల కుటుంబ సభ్యులను, క్షతగాత్రులను కలిసి పరామర్శించారు. అనంతరం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మృతుల కుటుంబాలను పరామర్శించి, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 50 వేల ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జర్పుల కల్యాణి, వైస్ ఎంపీపీ వెంకటాచారి, లక్ష్మణ్ నాయక్, దేశ్‌ముఖ్ ప్రతాప్‌రెడ్డి, యాదిరెడ్డి తదితరులు ఉన్నారు.

కృష్ణ బ్రిడ్జిపై రాకపోకలు నిషేధం

- 45రో జులపాటువం తెనమ రమ్మతులు

మక్తల్ టౌన్, జనవరి 6 : కృష్ణ మండలంలోని జాతీయ రహదారిపై ఉన్న టై రోడ్డు వద్ద కృష్ణ బ్రిడ్జికి మరమ్మతులు నిర్వహిస్తున్నామని, దీనిపై 45 రోజుల పాటు రాకపోకలు నిలిపివేస్తున్నట్లు రాయిచూర్ జిల్లా పోలీస్ కమిషనర్ శనివారం ప్రకటనలో తెలిపారు. రాయిచూర్‌కు వెళ్లే వాహనాలను దేవరకద్ర నుంచి దారి మళ్లించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ప్రజలు, వాహనదారులు గమనించి వంతెన మరమ్మతు పనులకు సహకరించాలని ఆయన కోరారు.

కొట్రలో దొంగల బీభత్సం

- తాళం వేసిన ఇండ్లే టార్గెట్ చేసినదుం డగులు
- 16 ఇండ్లల్లో రూ.4.11లక్షల నగదు, 6.5 తులాల బంగారం చోరీ
- భయాందోళనలోగ్రా మస్తులు

వెల్దండ, జనవరి 6 : దొంగలు బీభత్సం సృష్టించి, 16 ఇండ్లల్లో చోరీ చేసిన ఘటన వెల్దండ మండలం కొట్రలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. దొంగలు ఏకంగా 16 ఇండ్లల్లో చోరీకి పాల్పడి అందిన కాడికి దోచుకెళ్లారు. స్థానికుల వివరాల ప్రకారం.. వెల్దండ మండలం కొట్ర గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు తాళాలు వేసిన ఇండ్లలోకి చొరబడ్డారు. ఏకంగా 16 ఇండ్ల తాళాలు విరగ్గొట్టి దొరికిన కాడికి దోచుకెళ్లారు. మరి కొన్ని ఇండ్లల్లో చోరీకి విఫలయత్నం చేశారు. గ్రామానికి చెందిన కడారి పార్వతమ్మ, కొడుకు గణేశ్‌తో కలిసి ఉప్పునుంతల మండలం తిప్పాపూర్‌లోని తన కూతురి ఇంటికి మనువడి పుట్టిన రోజు వేడుకలకు శుక్రవారం సాయంత్రం వెళ్లారు. అదే విధంగా కవాటి కృష్ణయ్య తన భార్య ఇటీవల మృతి చెందడంతో కొన్ని రోజులు ఇల్లు వదిలి వెళ్లాలని పురోహితులు చెప్పగా వారు ఇంటికి తాళం పెట్టి వేరే ఇంట్లో ఉంటున్నారు. దీంతో పార్వతమ్మ ఇంటి తాళం విరగ్గొట్టిన దుండుగులు బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.3.80 లక్షల నగదు, 4.5గ్రాముల బంగారం, 10 తులాల వెండి, కావటి కృష్ణయ్య ఇంట్లో రెండు బీరువాలు పగులగొట్టి 2 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. తిర్మన్‌దాస్ సరోజనమ్మ ఇంట్లో రూ. 11వేలు, నత్తి లింగయ్య ఇంట్లో రూ.4 వేలు, కావటి తిరుపతయ్య ఇంట్లో రూ.10 వేలు, 20 తులాల వెండి, ముంగళిశెట్టి జంగమ్మ ఇంట్లో రూ.6 వేలు, తులం బంగారం, ముంగళిశెట్టి వెంకటయ్య ఇంట్లో 20 తులాల వెండి, బూత్కురి యాదమ్మ ఇంట్లో రూ.2వేలు, మాధవులు ఇంట్లో 14 తులాల వెండి అపహరించుకుపోయారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వెల్దండ సీఐ సోమనర్సయ్య, ఏఎస్సై కుమారస్వామి క్లూస్ టీం సాయంతో చోరీ జరిగిన ఇండ్లలో నమూనాలు సేకరించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

నమూనాలు సేకరిస్తున్న క్లూస్ టీం బృందం

విలపిస్తున్న బాధితురాలు పార్వతమ్మ

లారీని ఢీకొట్టిన బొలెరో

- ఒకరు మృతి, మరో ఇద్దరికితీ వ్రగాయాలు
- 30 గొర్రెలు మృత్యువాత

జడ్చర్లటౌన్, జనవరి 6 : జడ్చర్ల సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బొలెరో ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడిన ఘటన శనివారం చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి తమిళనాడు వెళ్తున్న ఐరన్‌లోడ్ లారీ జడ్చర్ల పట్టణ శివారులో టైరు పగిలి రోడ్డుపైనే నిలిచిపోయింది. ఈ క్రమంలో వరంగల్ నుంచి నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం నిడుగుర్తి గ్రామానికి గొర్రెల లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో బొలెరో డ్రైవర్ శేఖర్(35) అక్కడికక్కడే మృతి చెందగా అందులో ఉన్న నిడుగుర్తికి చెందిన రాములు, నర్సింహులుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గుర్తించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో జిల్లా దవాఖానకు తరలించారు. ఈ ప్రమాదంలో బొలెరోలో ఉన్న 30 గొర్రెలు కూడా మృతి చెందాయి. జడ్చర్ల పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జడ్చర్ల మార్చురీకి తరలించారు. ఆ తర్వాత ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అనంతరం ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదానికి గురైన బొలెరో

ఓడీఎఫ్ ప్లస్‌గా ఆత్మకూరు మున్సిపాలిటీ

ఆత్మకూరు, జనవరి 6 : స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం పలు విభాగాల్లో అవార్డులను ప్రకటించింది. 2023 సంవత్సరానికి గానూ ఆత్మకూరు మున్సిపాలిటీని ఓడీఎఫ్ ప్లస్‌గా గుర్తించి అవార్డు ప్రకటించారు. స్వచ్ఛ మున్సిపాలిటీగా ఆత్మకూరును ఎంపిక చేయడంపై మున్సిపల్ చైర్పర్సన్ గాయిత్రీయాదవ్, వైస్‌చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

- సంక్రాంతి పండుగకు ఆర్టీసీ కీలక నిర్ణయం
- నేటి నుంచి 15వ తేదీ వరకు అదనపు బస్సులు
- సాధారణ చార్జీలే వసూలు చేయనున్న కండక్టర్లు
- మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలో 420 సర్వీసులు
- ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల ఏర్పాటు

ప్రయాణికులకు గుడ్‌న్యూస్

మహబూబ్‌నగర్‌టౌన్, జనవరి 6 : సంక్రాంతి పండుగ కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశారు. శనివారం నుంచి 15వ తేదీ వరకు మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని తొమ్మిది డిపోల నుంచి 420 అదనపు బస్సు సర్వీసులు నడపనున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రజలు పండుగ కోసం స్వస్థలాలకు వచ్చే అవకాశం ఉండడంతో హైదరాబాద్‌కు అదనపు సర్వీసులు నడపడానికి తగిన ఏర్పాట్లు చేశారు. అన్ని డిపోలకూ హైదరాబాద్ రూట్లోనే ఎక్కువ ఆదాయం వస్తుండడంతో అదనపు సర్వీసులు కూడా ఎక్కువగానే నడపనున్నారు. ప్రత్యేక బస్సుల్లో సైతం సాధారణ చార్జీలే వసూలు చేయనున్నారు. ముఖ్యంగా అచ్చంపేట, తెలకపల్లి, డిండి, గద్వాల, అయిజ, కల్వకుర్తి, ఆమనగల్లు, కొల్లాపూర్, కోస్గి, మహబూబ్‌నగర్, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, నారాయణపేట, మద్దూర్, మరికల్, మక్తల్, షాద్‌నగర్, ఆరంఘర్, వనపర్తి, ఖిల్లాఘణపురం, పెబ్బేరు, కొత్తకోట తదితర ప్రాంతాలకు ఆయా డిపోల నుంచి బస్సులు నడపనున్నారు. డిపోల వారీగా మహబూబ్‌నగర్ నుంచి 59, షాద్‌నగర్ నుంచి 57, వనపర్తి నుంచి 58, గద్వాల నుంచి 48, నారాయణపేట నుంచి 45, కొల్లాపూర్ నుంచి 41, నాగర్‌కర్నూల్ నుంచి 38, కల్వకుర్తి నుంచి 39, అచ్చంపేట నుంచి 35 అదనపు సర్వీసులు నడిపిస్తారు.

ఏపీకి అదనపు బస్సులు..

ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు అదనపు బస్సులు (సూపర్ లగ్జరీ) నడపనున్నారు. మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు వెళ్తాయి. అక్కడి నుంచి రాజమండ్రి, అమలాపురం, విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ తదితర ప్రాంతాలకు బస్సులు నడపనున్నారు.

నేటినుంచి ప్రత్యేక బస్సులు..

సంక్రాంతికి వచ్చే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా అన్ని డిపోల నుంచి అదనపు బస్సు సర్వీసులు నడిపిస్తున్నాం. రీజియన్ పరిధిలో 9 డిపోల నుంచి 420 బస్సులు నడిపించేందుకు ఏర్పాట్లు చేశాం. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నేటినుంచి 15వ తేదీ వరకు అదనపు బస్సులు నడిపిస్తున్నాం. దూరప్రాంతాలకు వెళ్లాలనుకునే వారు ముందస్తు రిజర్వేషన్ కూడా చేసుకోవచ్చు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. రద్దీని బట్టి మరిన్ని బస్సులు నడపడానికి చర్యలు తీసుకుంటాం.

- వి.శ్రీదేవి, ఆర్టీసీ ఆర్ఎం, మహబూబ్‌నగర్